ఎల్‌నినో ప్రభావం పట్ల అప్రమత్తంగా ఉండాలి





- రైతులు రెండో పంట వేసి ఇబ్బంది పడొద్దు ..
- యూనిట్‌కు రూ.15 చెల్లించినా విద్యుత్తు దొరకని పరిస్థితి..
- తొలి పంటను కాపాడేందుకు ప్రభుత్వం శతవిధాల కృషి ..
- భవిష్యత్తులో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలకు ప్రణాళిక
- కేంద్రాన్ని కలిసి తెలంగాణకు ప్రత్యేక ప్యాకేజీ కోరతాం..
- రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి ..
- కూసుమంచి మండలంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం..

ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 11 (అక్షరం న్యూస్)

కూసుమంచి: ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర జల వనరుల సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఇప్పటికే రైతులు సాగు చేసిన తొలి పంటను కాపాడేందుకు ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో రెండో పంట వేసి ఇబ్బందులు పడొద్దని విజ్ఞప్తి చేశారు. ఆదివారం కూసుమంచి మండలంలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఐటీడీఏ నిధులు రూ.1.63 కోట్లతోమంగలితండా--దుబ్బతండా మధ్య నిర్మించనున్న బీటీ రహదారి పనులకు, జుజ్జుల్ రావుపేటలో రూ.45 లక్షలతో చేపట్టనున్న ఓవర్‌హెడ్ ట్యాంకు, పైపులైన్ పనులకు

శంకుస్థాపన చేశారు.

మంగలితండాలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. అలాగే.. హటియాతండాలో ఇటీవల మృతి చెందిన మాజీ ఎంపీటీసీ బదావత్ వీరన్న తండ్రి బాషా కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాల శ్రీకార సభల్లో మంత్రి ప్రసంగించారు.

రూ.15 పెట్టినా విద్యుత్తు దొరకడం లేదు..

గతంలో యూనిట్ విద్యుత్తు రూ.7, రూ.8కు లభించేదని, ప్రస్తుతం విద్యుత్తు కొరత తీవ్రంగా ఉందని మంత్రి పొంగులేటి ఆవేదన వ్యక్తం చేశారు. యూనిట్‌కు రూ.15 చెల్లించి కొనుగోలు చేయాలన్నా దేశంలో విద్యుత్తు లభించని పరిస్థితులు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. భూగర్భ జలమట్టాలు క్రమంగా పడిపోతున్న నేపథ్యంలో భవిష్యత్తులో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ఇప్పటి నుంచే పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

లిరెండో పంట సాగు వద్దు..లి

ఎల్‌నినో ప్రభావం తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో రైతులు రెండో పంట సాగు చేయవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే వేసిన తొలి పంటను కాపాడేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. రెండో పంట వేసి, నీరు అందక పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయే పరిస్థితి తెచ్చుకోవద్దని, ప్రభుత్వ సూచనలను పాటించాలని కోరారు.

కేంద్రాన్ని కలిసి ప్రత్యేక ప్యాకేజీ కోరతాం..

ఎల్‌నినో ప్రభావం దక్షిణాది రాష్ట్రాలపై తీవ్రంగా ఉందని పొంగులేటి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర మంత్రివర్గ బృందం ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులను కలిసి తెలంగాణలో నెలకొన్న పరిస్థితులను వివరించనున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి అధిక ఆర్థిక సహాయం అందించేలా ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, జీ రామ్ జీ పథకం కింద గ్రామాల్లో అదనపు పనిదినాలు కల్పించాలని కేంద్రాన్ని అభ్యర్థించనున్నట్లు చెప్పారు.

ఈ కార్యక్రమాల్లో.. కలెక్టర్ దివాకర.టీఎస్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బజ్జూరి వెంకటరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ. హఫీజుద్దీన్, జూకూరి గోపాలరావు, పలువురు సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాల్లో మహిళలంతా పెద్దఎత్తున పాల్గొనాలి

- మాధన్ హిప్పరగా సర్పంచ్ బాచవార్ లక్ష్మణ్ పటేల్ పిలుపు

మద్దూర్ / అక్టోబర్ 11 (అక్షరం న్యూస్ -- కామారెడ్డి):

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని జుక్కల్ నియోజకవర్గంలో నిర్వహించనున్న బతుకమ్మ సంబురాలను విజయవంతం చేయాలని డోంగ్లీ మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు బాచవార్ లక్ష్మణ్ పటేల్ కోరారు. ఈ నెల 13న జుక్కల్‌లోని గుండూర్ రోడ్డు వద్ద నిర్వహించనున్న ఈ వేడుకల్లో ఉమ్మడి మండలాల పరిధిలోని గ్రామాల మహిళలు, ఆడపడుచులు, యువతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పేలా బతుకమ్మ వేడుకలు

బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, పూల పండుగ వైభవానికి ప్రతీక అని లక్ష్మణ్ పటేల్ పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంప్రదాయాలను కాపాడుకుంటూ, భావితరాలకు వాటి గొప్పతనాన్ని తెలియజేయడానికి ఇలాంటి వేడుకలు ఎంతో దోహదపడతాయని తెలిపారు.

జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు (ఎల్‌కేఆర్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న బతుకమ్మ సంబురాల్లో మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల



పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి పాల్గొనాలని కోరారు. గ్రామాల మధ్య ఐక్యతను పెంపొందిస్తూ, పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని సూచించారు.

పోటీల్లో విజేతలకు ప్రత్యేక బహుమతులు

ఈ బతుకమ్మ సంబురాల్లో బతుకమ్మల అలంకరణ, ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని లక్ష్మణ్ పటేల్ తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన మహిళలు, యువతులకు ప్రత్యేక బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు.

మహిళలు తమ ప్రతిభను చాటుకునేందుకు ఈ వేడుకలు మంచి అవకాశమని, ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మహిళల భాగస్వామ్యంతో వేడుకలను విజయవంతం చేయాలి

బతుకమ్మ సంబురాలు కేవలం పండుగ మాత్రమే కాకుండా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని లక్ష్మణ్ పటేల్ పేర్కొన్నారు. గ్రామ ప్రజలందరూ కలిసికట్టుగా పాల్గొని బతుకమ్మ పండుగ వైభవాన్ని చాటిచెప్పాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమ వివరాలు:

తేదీ: అక్టోబర్ 13

వేదిక: గుండూర్ చౌరస్తా, జుక్కల్

ప్రత్యేకత: బతుకమ్మ అలంకరణ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విజేతలకు బహుమతులు

తెలంగాణ ఆడపడుచులందరూ బతుకమ్మ సంబురాల్లో పాల్గొని, పూల పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్ బాచవార్ లక్ష్మణ్ పటేల్ కోరారు.

బీసీ సెల్ మండల అధ్యక్షులుగా కోడూరు రాము

- అంచలంచెలుగా ఎదిగిన బీసీ నేత....
- వ్యాపార పరంగా రాజకీయాల్లో రాణిస్తున్న యువనేత..

ఖమ్మం/తల్లాడ అక్టోబర్ 11 (అక్షరం న్యూస్)

కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ తల్లాడ మండల అధ్యక్షులుగా తల్లాడ పట్టణానికి చెందిన కోడూరు రాము ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయనకు ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి, మండల కమిటీ ఆధ్వర్యంలో

సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గత 20

ఏళ్ల నుండి క్రియాశీల రాజకీయాల్లో ఆయన కొనసాగుతున్నారు. తొలుత తెలుగుదేశం పార్టీ అనంతరం టిఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు. తెలుగుదేశం పార్టీలో వాణిజ్య విభాగం మండల కోశాధికారిగా విధులు నిర్వహించారు. టిఆర్ఎస్ హయాంలో టిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షులుగా పనిచేశారు. ప్రస్తుతం అధికార కాంగ్రెస్ పార్టీలో బీసీ సెల్ తల్లాడ



మండల అధ్యక్షులుగా నియామకం అయ్యారు.

వ్యాపారవేత్త నుండి రాజకీయాల్లోకి..

వ్యాపార పరంగా ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తూనే రాజకీయంగా కూడా తనదైన శైలిలో రాణిస్తున్నాడు. ప్రస్తుత రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రధాన అనుచరుడుగా కొనసాగుతున్నాడు. ఆయన ఏ పార్టీలో ఉంటే ఆయన వెంటే నడుస్తూ తన రాజకీయ ప్రస్థానాన్ని నడుపుతున్నాడు.

వీరారెడ్డి అనుచరుడుగా..

మండలంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దుండేటి వీరారెడ్డి అనుచరుడుగా ప్రస్తుతం కొనసాగుతున్నాడు. అంతేకాకుండా సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత మట్టా దయానంద్ లకు సుపరిచితులుగా ఉన్నారు. ఈ సందర్భంగా కోడూరు రాము మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచి ఈ పదవి ఇచ్చినందుకు మండలంలో పార్టీ బలోపేతం, బీసీల ఐక్యత కోసం కృషి చేస్తానని తెలిపారు. తనకు అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికి ఆయన పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

బతుకమ్మగాట్ కు వెలుగులు



ఖమ్మం/ వైరా టౌన్ అక్టోబర్ 11 (అక్షరం న్యూస్)

నాలుగో వార్డు కౌన్సిలర్ వేముల శ్రావణి కృషితో బతకమ్మ ఘాటుకు వెలుగులు.. వైరా మున్సిపల్ వైర్ పర్సన్ చైర్పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ సహకారంతో చెరువు బజారు నుండి బతుకమ్మ ఘాట్ వరకు ఈరోజు సెంట్రల్ లైట్లు వేయించడం జరిగింది. దసరా ఉత్సవాల సందర్భంగా బతుకమ్మ ఘాట్ వరకు పట్టణ ప్రజలు మహిళలకు వాకర్లకు రైతులకు జాలర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పూర్తి సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కాప చంద్రకళ ఏఎంసీ చైర్మన్ గంగారావు, వైరా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడువీరం శెట్టి సీతారాములు, వేముల రత్నాకర్ నరసింహారావు పాలేటి నరసింహారావు భాస్కర్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూలవనంలో చిగురించిన ఆశల బతుకమ్మ

- ఖమ్మంలో తలసేమియా చిన్నారుల..
- హృదయాలను హత్తుకునే వేడుకలు.
- రక్తదాతలే మా ప్రాణదాతలు.. బంగారు బతుకునివ్వమ్మా గౌరమ్మ!



ఖమ్మం /ఖమ్మం టౌన్ అక్టోబర్ 11 (అక్షరం న్యూస్) బతుకమ్మా.. బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకు ఇవ్వమ్మా.. ఉయ్యాలో!" ఆ పసి గొంతుకల నుంచి వెలువడిన ఈ ఆర్తనాదం, ఆనంద కేకలు ఆ ప్రాంగణాన్ని ఒక దివ్యమైన పూల వనంగా మార్చేశాయి. రోజూ మందు బిళ్లలు, సూదిమందుల నడుమ పోరాడే ఆ చిన్నారి ప్రాణాలు, తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకైన బతుకమ్మ పండుగ వేళ ఒక్కసారిగా ఉత్సాహంతో ఉప్పొంగాయి.

సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో

వైరా రోడ్డులోని రితన్య ఆసుపత్రి ప్రాంగణం ఆదివారం నాడు సరికొత్త శోభను సంతరించుకుంది. తలసేమియా మహమ్మారితో పోరాడుతున్న చిన్నారులు తమ తల్లిదండ్రులతో కలిసి స్వయంగా రంగురంగుల పూలను సేకరించారు. తమ చిన్నారి చేతులతోనే ఎంతో శ్రద్ధగా, భక్తిశ్రద్ధలతో ఒక భారీ బతుకమ్మను తీర్చిదిద్దారు. ?సాంప్రదాయ దుస్తుల్లో ముద్దుముద్దుగా తయారై వచ్చిన ఆ చిన్నారుల ముఖాల్లోని చిరునవ్వులు అందరినీ కంటతడి పెట్టించాయి. గౌరమ్మకు, బతుకమ్మకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం, వారు వలయాకారంగా తిరుగుతూ ఆడిపాడిన తీరు అందరి హృదయాలను హత్తుకుంది. ?ఈ వేడుకల్లో చిన్నారులు చేసిన వేడుక కేవలం ఆటపాటలకే పరిమితం కాలేదు; తమకు ప్రతి నెలా ప్రాణం పోస్తున్న రక్తదాతలను తలుచుకుంటూ వారు భావోద్వేగానికి గురయ్యారు. "మాకు పునర్జన్మ ఇస్తున్న రక్తదాతలను, దేవుళ్లా ఆదుకుంటున్న మనుషులను ఎల్లప్పుడూ చల్లగా చూడమ్మా గౌరమ్మ" అంటూ ఆ చిన్నారులు వేడుకున్న తీరు అక్కడి వారందరి గొంతుకలను మూగబోయేలా చేసింది. ?ఈ మానవీయ వేడుకల్లో ప్రముఖ వైద్యులు డాక్టర్ డి. నారాయణమూర్తి, సంస్థ ఫౌండర్ అనిత, సంస్థ బాధ్యులు ప్రొద్దుటూరి పావని, పి. ఉదయభాస్కర్, పి. రవిచందర్ తదితరులు పాల్గొని చిన్నారులతో పాటు బతుకమ్మ ఆటలాడి, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపారు. పూల పండుగ తెచ్చిన ఈ సంతోషం ఆచిన్నారులజీవితాల్లోచిరకాలంనిలవాలనిప్రతిఒక్కరూ ఆకాంక్షించారు.

జూన్ నాటికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ అందుబాటులోకి రావాలి

- పాన్నెకల్ వద్ద నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి పొంగులేటి



ఖమ్మం/స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 11 (అక్షరం న్యూస్)

ఖమ్మం రూరల్: వచ్చే విద్యా సంవత్సరం జూన్ నాటికి పాన్నెకల్ వద్ద నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. పాన్నెకల్ వద్ద రూ.200 కోట్ల వ్యయంతో చేపట్టిన పాఠశాల భవన సముదాయ నిర్మాణ పనులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ దివాకర.టీఎస్‌తో కలిసి ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రాంగణమంతా కలియతిరుగుతూ వివిధ విభాగాల నిర్మాణ పురోగతిని సమీక్షించారు. అధికారులు మ్యాప్ ల ప్రస్తుత పరిస్థితిని వివరించారు. పనుల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి.. నిర్దేశిత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేసేలా సమన్వయంతో పనిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే లక్ష్యం..

పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోందని మంత్రి తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన వసతి సదుపాయాలు కల్పించడమే ఈ పాఠశాలల ప్రధాన ఉద్దేశమని వివరి ంచారు. ఏదు లాపురం మున్సిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, పలువురు ప్రజా ప్రతినిధు లు, కాం గ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



సద్దుల బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ దిలీప్



కరీంనగర్/జమ్మికుంట/అక్టోబర్ 11/ అక్షరం న్యూస్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగలో భాగంగా సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జమ్మికుంట పట్టణంలో ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 30 వార్డులకు చెందిన మహిళలు, అక్కాచెల్లెళ్లు సద్దుల బతుకమ్మ ఆడుకునేందుకు వీలుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం, నాయిని చెరువు వద్ద చేపట్టనున్న ఏర్పాట్ల పనులను మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ, తెలంగాణలో బతుకమ్మ పండుగకు ప్రత్యేకమైన గుర్తింపు ఉందని, ప్రకృతిని, పూలను పూజిస్తూ మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై తొమ్మిది రోజులపాటు సాగే ఈ పూల పండుగలో సద్దుల బతుకమ్మకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు.సద్దుల బతుకమ్మ పండుగను మహిళలు ఆనందోత్సాహాలతో, ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకునేలా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం తమ పాలకవర్గం బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం, నాయిని చెరువు వద్ద బతుకమ్మ ఆడుకునే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. పండుగకు వచ్చే మహిళలకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తారని వెల్లడించారు.తెలంగాణ ఆడపడుచులందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, జమ్మికుంట పట్టణంలో సద్దుల బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు. పొనగంటి రాము, విష్ణువర్ధన్, సురేష్, చందన శంకర్, ప్రజాప్రతినిధులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అక్కా.. ఎట్లున్నారమ్మా

•పత్తి చేను వద్ద కూలీలతో మంత్రి పొంగులేటి ఆత్మీయ పలకరింపు..



ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 11 (అక్షరం న్యూస్)

కూసుమంచి: చేనులో పత్తి ఏరుతున్న వ్యవసాయ కూలీలను చూసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన వాహనాన్ని ఆపారు. కారు దిగి వారి వద్దకు వెళ్లి.. 'ఏం అక్కా.. ఎట్లున్నరు తల్లి.. పనులు ఎట్లా సాగుతున్నాయి.. పత్తి దిగుబడి బాగుందా?' అంటూ ఆప్యాయంగా పలకరించారు. వారి యోగక్షేమాలు తెలుసుకుని, ఆర్థిక సాయం అందజేశారు. దసరా పండుగకు కొత్త బట్టలు కొనుక్కోవాలని సూచించారు.

ఆదివారం కూసుమంచిలో చెక్కుల పంపిణీ కార్యక్రమం ముగించుకుని తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు వెళ్తున్న సమయంలో చేగొమ్మ వద్ద ఈ ఆత్మీయ దృశ్యం ఆవిష్కృతమైంది. రోడ్డు పక్కనే ఉన్న పత్తి చేనులో కూలీలు పనిచేస్తుండటాన్ని గమనించిన మంత్రి.. వెంటనే వాహనాన్ని నిలిపి వారి వద్దకు వెళ్లారు. తమ అభిమాన నాయకుడు 'శీనన్న'ను చూసిన కూలీలు సంతోషంతో రోడ్డు మీదకు వచ్చారు. మంత్రి వారితో కరచాలనం చేస్తూ పలకరించి, కాసేపు ముచ్చటించారు. తమను ఆప్యాయంగా పలకరించి ఆర్థిక సాయం అందించిన మంత్రికి మహిళా కూలీలు కృతజ్ఞతలు తెలిపారు. అధికారిక కార్యక్రమాల మధ్య సామాన్యులతో మమేకమై, వారి కష్టసుఖాలను తెలుసుకున్న మంత్రి ఆప్యాయత అక్కడి వారిని ఆకట్టుకుంది.

మెనూర్‌లో మేక అదృశ్యం ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వండి



మద్నూర్ / అక్టోబర్ 11 (అక్షరం న్యూస్ -- కామారెడ్డి):

కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం మెనూర్ గ్రామానికి చెందిన మహేమూద్ చికెన్ సెంటర్ యజమాని మేక తప్పిపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం సాయంత్రం వారి ఇంట్లో గ్యారవి కార్యక్రమం జరుగుతున్న సమయంలో ఇంటి నుంచి మేక తప్పిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.మేక తప్పిపోయిన విషయాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు గ్రామంలో పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. మేక కోసం పరిసర ప్రాంతాల్లో కూడా వెతుకుతున్నారు.మేక గుర్తులు ఇవే!తప్పిపోయిన మేక మెడలో తాడు ఉందని, నెత్తిపై తెల్లటి గుర్తుతో పాటు మూడు కాళ్లకు తెల్లటి గుర్తులు ఉన్నాయని మహేమూద్ తెలిపారు. ఈ గుర్తుల ఆధారంగా మేకను గుర్తించవచ్చని పేర్కొన్నారు.ఆచూకీ తెలిస్తే సమాచారం ఈ ఫోన్ నంబర్ 9505249115 కు సమాచారం ఇవ్వాలని కోరారు.ఎవరైనా మేకను చూసినా, దాని ఆచూకీ తెలిసినా వెంటనే మహేమూద్‌కు సమాచారం అందించి, మేకను తిరిగి అప్పగించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. మేకను గుర్తించడంలో గ్రామస్తులు, పరిసర ప్రాంతాల ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అశ్వారావుపేట క్రీడా ప్రాంగణానికి మహర్దశ

అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలి!





• తెలంగాణ క్రీడాకారులు పతకాలతో మెరవాలి: మంత్రి పొంగులేటి

• రూ.23.50 కోట్లతో రహదారుల అభివృద్ధి పనుల ప్రారంభం..

• 33 జిల్లాల బాలికల కబడ్డీ పోటీలకు అశ్వారావుపేట వేదిక

భద్రాద్రి కొత్తగూడెం / అశ్వారావుపేట / అక్టోబర్ 10 / అక్షరం న్యూస్ :తెలంగాణ రాష్ట్ర క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి పతకాలు సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని క్రీడాకారులకు సూచించారు. శనివారం ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి, అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో రాహుల్‌తో కలిసి అశ్వారావుపేట పట్టణంలో రూ. 23.50 కోట్ల వ్యయంతో చేపట్టిన రహదారుల అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం స్థానిక మినీ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-20 బాలికల కబడ్డీ పోటీలను ప్రారంభించారు.

రూ.23.50 కోట్లతో రహదారుల అభివృద్ధిలిలి

అశ్వారావుపేట పట్టణంలో చేపట్టిన రహదారుల అభివృద్ధి పనుల్లో భాగంగా ఖమ్మం--దేవరపల్లి రహదారిలో 119/0 కిలోమీటరు నుంచి 121/0 కిలోమీటరు వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను మంత్రి బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ పనులతో పాటు సీసీ డివైడర్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులను చేపట్టారు. అదేవిధంగా అశ్వారావుపేట--బూర్గంపాడు రహదారిలో 0/0 కిలోమీటరు నుంచి 1/5 కిలోమీటరు వరకు రెండు వరుసల రహదారిని నాలుగు వరుసల రహదారిగా విస్తరించి పటిష్టపరిచే పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను మంత్రి పరిశీలించారు.

బతుకమ్మలతో భారీ ర్యాలీ.. పండుగ వాతావరణం

అనంతరం అశ్వారావుపేట మినీ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-20 బాలికల కబడ్డీ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారిణులు, మహిళలు బతుకమ్మలతో అశ్వారావుపేట ప్రధాన కూడలి నుంచి క్రీడా ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాగిన ఈ ర్యాలీతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది.

క్రీడా ప్రాంగణానికి చేరుకున్న అనంతరం మంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, రిబ్బన్ కట్ చేసి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారిణులు, మహిళలతో కలిసి బతుకమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, వారితో కలిసి బతుకమ్మ ఆడారు.

మినీ స్టేడియాన్ని మణిహారంగా తీర్చిదిద్దుతాం: మంత్రి పొంగులేటిలిలి

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, దసరా, నవరాత్రులు, బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అశ్వారావుపేట వంటి గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు క్రీడలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఐదు ఎకరాలకు పైగా విస్తీర్ణంలో నిర్మించిన అశ్వారావుపేట మినీ స్టేడియాన్ని భవిష్యత్తులో పట్టణానికి మణిహారంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి బాలికల కబడ్డీ జట్లు ఈ పోటీల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. చిన్న మున్సిపాలిటీ అయినప్పటికీ క్రీడాకారిణులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతి, ఇతర సదుపాయాలు కల్పించిన నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సహకరించిన దాతలను అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేసిన అనుభవంతో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణను ప్రత్యేకంగా అభినందించారు.

క్రీడల్లో గెలుపోటములు సహజమని, ప్రతి క్రీడాకారిణి క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని తన ప్రతిభను చాటాలని మంత్రి సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకుంటారని, వారి ఆశలను నెరవేర్చేలా విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు.

తెలంగాణ రాష్ట్రం క్రీడారంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు సాధించేలా ప్రభుత్వం క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ, అవసరమైన సదుపాయాలు, ప్రోత్సాహం అందిస్తుందని స్పష్టం చేశారు. రాబోయే ఐదారు సంవత్సరాల్లో అంతర్జాతీయ క్రీడా వేదికలపై తెలంగాణ క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించే దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు.

గ్రామీణ క్రీడలకు మరింత ప్రోత్సాహం: ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డిలిలి



ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి క్రీడా పోటీల నిర్వహణకు ఎంతో ప్రణాళిక, కృషి అవసరమని అన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి క్రీడాకారులను అశ్వారావుపేట వంటి మారుమూల ప్రాంతానికి తీసుకువచ్చి పోటీలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.కబడ్డీ గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రాచుర్యం పొందిన క్రీడ అని, ప్రో కబడ్డీ లీగ్ వంటి వేదికల ద్వారా దేశవ్యాప్తంగా ఈ క్రీడకు మరింత గుర్తింపు లభిస్తోందని తెలిపారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ, ఓటమి నుంచి పాఠాలు నేర్చుకొని ముందుకు సాగాలని సూచించారు.

గిరిజన ప్రాంత క్రీడాకారులకు అవకాశాలు కల్పిస్తాం: ఎమ్మెల్యే జారేలిలి

అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా క్రీడాకారులు ఆసక్తిగా ఎదురుచూసే రాష్ట్రస్థాయి పోటీలను గిరిజన ప్రాంతమైన అశ్వారావుపేటలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ ప్రాంతం నుంచి మరింత మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలనే లక్ష్యంతో పోటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.వ్యాయామ ఉపాధ్యాయుడిగా గతంలో అనేక క్రీడా కార్యక్రమాలు నిర్వహించిన అనుభవం తనకు ఉందని, ప్రతిభావంతులైన క్రీడాకారులకు తగిన అవకాశాలు కల్పించాలన్న సంకల్పంతో ఈ పోటీలకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. క్రీడా పోటీల నిర్వహణకు సహకరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, కార్యకర్తలకు, క్రీడా నిర్వాహకులకు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడా సదుపాయాల అభివృద్ధికి చర్యలు: కలెక్టర్ అంకిత్‌లిలి

జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, 33 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారిణులకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల నిర్వహణ జిల్లాలో క్రీడా కార్యకలాపాలకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని అన్నారు.జిల్లాలో క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు ఆర్చరీ, షూటింగ్ వంటి విభాగాల్లో క్రీడా సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. వేసవి శిక్షణ శిబిరాల ద్వారా క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ అందించడంతో పాటు, వివిధ క్రీడా పోటీలను నిర్వహిస్తూ ప్రతిభావంతులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. క్రీడాకారిణులు పోటీల్లో తమ అత్యుత్తమ ప్రతిభను కనబరచాలని ఆకాంక్షించారు.

క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలి: ఎస్పీ రోహిత్ రాజులిలి

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ, వివిధ జిల్లాల నుంచి అశ్వారావుపేటకు వచ్చి పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారిణులకు స్వాగతం పలికారు. గెలుపోటముల కంటే క్రీడల్లో పాల్గొనడం, కష్టపడడం, పోటీతత్వంతో ముందుకు సాగడం ముఖ్యమని తెలిపారు.

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారిణులను చూసి స్థానిక గిరిజన యువత స్ఫూర్తి పొంది క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని ఆకాంక్షించారు. పోటీల నిర్వహణ విజయవంతం కావడానికి పోలీసు శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

గిరిజన యువ క్రీడాకారులకు స్ఫూర్తి: ఐటీడీఏ పీవో రాహుల్‌లిలి

ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ, కబడ్డీ క్రీడకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు ఉందన్నారు. ప్రో కబడ్డీ లీగ్ ద్వారా మారుమూల ప్రాంతాల్లోని క్రీడాకారులకు కూడా తమ ప్రతిభను చాటుకునే అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన గిరిజన యువకుడు తోడెం ప్రసాద్ స్థానిక గిరిజన పాఠశాలల్లో చదువుకొని ప్రో కబడ్డీ స్థాయికి ఎదగడం జిల్లాలోని యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, మున్సిపల్ కమిషనర్ దిలీప్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, క్రీడా నిర్వాహకులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారిణులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609